'పేలుతున్న' ధరలు


దుకాణాలను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

లైసెన్సు ఫీజుల పేరిట భారీగా వసూళ్లు
ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు
కళ తప్పుతున్న దీపావళి దుకాణాలు
ధరలు పెరగడంతో వినియోగదారులు విలవిల
బాణసంచా విక్రయాలపై నెలాఖరు దెబ్బ

అమలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. ధరలు అధికంగా పెంచడం వల్ల వినియోగదారులు కొనుగోలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు నెలాఖరు కావడంతో జీతాలు అందక ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవడంతో ఉద్యోగుల్లో సైతం కొనుగోలు శక్తి తగ్గింది. రెవెన్యూతో సహా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు బాణసంచా దుకాణదారుల నుంచి భారీగా లైసెన్సు ఫీజులు వసూలు చేయడంతో వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. ఒక షాపునకు అన్ని లైసెన్సు ఫీజులు కలిపి రూ.15 వేలు నుంచి రూ.20 వేల పైనే చెల్లించాల్సి వస్తుందంటూ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఈ ఒక్కచోటే దుకాణాలు ఏర్పాటు చేశారు. సుమారు 53 దుకాణాలకు ఈ స్టేడియంలో అనుమతి ఇచ్చారు. లైసెన్సు ఫీజులతో పాటు జీఎస్టీతో సహా వివిధ రకాల ట్యాక్సులు బాణసంచాపై భారీగా విధించడంతో వ్యాపారులు రేట్లు పెంచి దారుణంగా విక్రయాలు జరుపుతున్నారు. కొన్నిరోజులకు ముందే దీపావళి వేడుకల హడావుడి కనిపించేది. దీపావళి దుకాణాల వద్ద కాకరపువ్వొత్తులు, తాళ్లు, అగ్గిపెట్టెలు, చిచ్చుబుడ్డులు, మతాబులు, సీమ టపాకాయలు, వాలాలు, షాట్స్ వంటి వివిధ రకాల బాణసంచా ధరలు గతం కంటే భారీగా పెరిగిపోయాయి. వేలకు వేలు ఖర్చుచేసి కొనుగోలు చేసినా కొద్దిపాటి సామగ్రి కూడా వచ్చే పరిస్థితి లేదంటూ కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు. పెరుగుతున్న ధరలతో దీపావళి కళ తప్పిందనే చెప్పాలి. అదే విధంగా జిల్లాలోని రావులపాలెం, మండపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట, మలికిపురం, తాటిపాక సెంటర్లలో ఏర్పాటు చేసిన దుకాణాల నుంచి స్థానిక అధికారులు వసూళ్లు బాగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు భారీగా పెరిగిన లైసెన్సు ఫీజులతో ఇబ్బంది పడుతున్నారు. వినియోగదారుల్లో ధరల పెరుగుదలతో కొనుగోలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. గురువారం వాతావరణంలో ఎటువంటి మార్పులు లేకపోతే వ్యాపారాలు ముందుకు సాగుతాయని బాలయోగి స్టేడియంలో దుకాణాలు వేసిన బాణసంచా వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్.పార్థసారథి, టౌన్ సీఐ పి.వీరబాబు తదితరులు పరిశీలించి దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.



దీపం-2 పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హామీ మేరకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిల్లిండర్లు ఉచితంగా దీపం-2 పథకం కింద అమలుకు శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో కలిసి ఆయన వివిధ మండలాల తహశీల్దార్లు, ఆర్డీవోలు, పౌరసరఫరాల డీటీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గ్యాస్ కంపెనీల వద్ద ఇప్పటికే బుకింగ్ ప్రారంభమైనట్టు ఆయన తెలిపారు. నవంబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్ఛాపురంలో ఉచిత గ్యాస్ సిల్లిండర్ల పంపిణీని ప్రారంభిస్తారని, అదే సమయంలో నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తారన్నారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ 2025 మార్చి 31 వరకు మొదటి విడత సిలిండర్‌ను పొందవచ్చునన్నారు. లబ్ధిదారుని ఆధార్ నంబరును అనుసంధానమైన గ్యాస్ కనెక్షన్ కార్డుకు వారి ఈకేవైసీ నమోదుచేసి బ్యాంకు అక్కౌంట్‌కు లింక్ చేసి ఉండాలని తెలిపారు. సిలిండర్ పొందే సమయంలో లబ్ధిదారులు గ్యాస్ ధర ముందుగా పూర్తిగా చెల్లించాలన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటలలోపు, పట్టణ ప్రాంతాల్లో 24 గంటలలోపు వారి బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ నిధులు నేరుగా జమ అవుతాయన్నారు. ఇందుకు సంబంధించి సంక్షిప్త సమాచారం ఎప్పటికప్పుడు మొబైల్ నంబరుకు తెలియచేస్తారన్నారు. ఉచిత గ్యాస్ సిల్లిండర్ల కోసం ఏమైనా సమస్యలు ఉంటే లబ్ధిదారులు టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫోన్ చేయాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు బాణసంచా దుకాణం సముదాయాలను సందర్శించి అగ్నిమాపక నిబంధనలకు అనుగుణంగా లేకుంటే అప్పటికప్పుడు సీజ్ చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు.



అప్రమత్తంగా ఉంటే..
ఆనంద దీపావళే!

● అజాగ్రత్తగా ఉంటే అనర్థాలు ● కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి

పండుగల్లో దీపావళి సందడే వేరు. కొత్త వస్త్రాలు, చుట్టాలు, పిండి వంటలతోపాటు ఏ పండుగ రోజూ లేని సందడి ఈరోజు ఉంటుంది. చీకటి పడే సమయానికి దీపాల వరుసలు ముచ్చట గొలిపితే.. ఆ వెంటనే బాణసంచా కాల్పుల హంగామా మొదలైపోతుంది. అయితే ఏ పండుగకూ తీసుకోనన్ని జాగ్రత్తలు కూడా దీపావళికి మాత్రం కచ్చితంగా తీసుకోవాల్సిందే. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా రెప్పపాటులో విషాదం అలుముకొనే ప్రమాదం బాణసంచా రూపంలో పొంచి ఉంటుంది. అందువల్ల చిన్నపాటి విషయాల్లో కూడా అలసత్వం అస్సలు పనికిరాదు. దీపావళిని సురక్షితంగా జరుపుకొని ఆనందించాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే. పండుగ సరదాతోపాటు పర్యావరణాన్నీ దృష్టిలో పెట్టుకోవడం కూడా మరువరాదు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బాణసంచా కాల్చే సమయంలో పిల్లలను పెద్దలు కచ్చితంగా గమనిస్తూ ఉండాలి. కాటన్ దుస్తులను ధరించాలి. చెప్పులు వేసుకోవాలి. బాణసంచాను ఇంట్లో కాకుండా ఆరుబయట నిల్వచేయాలి. నిల్వ చేసుకున్న బాణసంచాకు సాధ్యమైనంత దూరంగా ఒక్కొటిగా కాల్చుకోవాలి. ప్రసిద్ధ కంపెనీలు తయారు చేసిన బాణసంచా అయితే ప్రమాణాల ప్రకారం ఉంటాయి. ఐఎస్ఐ మార్కు ఉన్నవైతే ఇంకా బెటర్. బాణసంచా కాలుస్తున్న చోట రెండు మూడు బకెట్ల నీళ్లు తప్పనిసరిగా పెట్టుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత నీటిలో పడేయాలి. బాణసంచాను వెలిగించి వాహనాలపై, మనుషులు, జంతువులపైకి విసరడం నేరం. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో బాణసంచా వెలిగించడం ప్రమాదకరం. ముఖం దగ్గరగా ఉంచి కాల్చడం, కొద్దిగా కాలి లేదా ఒత్తి కొద్దిగా కాలి ఆరిపోయిన వాటి దగ్గరకు వెళ్లి కదిపి చూడడం మళ్లీ వెలిగించడం చేయరాదు. పొడవాటి కర్రతో దూరంగా తోసేయాలి. సెర్చిలైట్లు, చిచ్చుబుడ్లు వంటి వాటిని చేతితో పట్టుకొని కాల్చరాదు. అవి పేలి ప్రమాదాల బారిన పడిన వాళ్లు చాలామంది ఉన్నారు. బాంబుల వంటి వాటిని అలవాటు ఉంటేనే కాల్చాలి. కొత్త వాటితో ప్రయోగాలు చేయకూడదు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా బాణసంచా కాల్చాలి. తారాజువ్వల వంటి వాటిని రోడ్లపై, ఇతరుల ఇళ్లల్లోకి వేస్తే కేసుల్లో ఇరుక్కుంటారు. దీపావళి రోజున రాత్రి వేళల్లో సాధ్యమైనంత వరకూ బయట సంచరించకపోవడమే మేలు. ఎంత మొత్తంలో మందుగుండు కాల్చేశామా అనేదికాదు.. ఎంత సురక్షితంగా దీపావళి చేసుకున్నామా అనేదే ముఖ్యమని భావించాలి.

● దుకాణాల నిబంధనలు ఇవే..

బాణసంచా విక్రయించే దుకాణాల విషయంలో రెండు షాపుల మధ్యలో కనీసం 3 మీటర్ల ఖాళీ ఉండాలి. ప్రతి షాపు వద్ద ఇసుకతోపాటు 200 లీటర్ల నీళ్ల డ్రమ్ములు రెండు ఉండాలి. వాటిలో జగ్గులు, నిరంతరం నిండుగా నీళ్లు ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధూమపానం చేయకూడదు. ఆ బోర్డులను దుకాణాల వద్ద ఉంచాలి. నిప్పు రగిల్చే వాటిని దూరంగా ఉంచాలి. దుకాణాలకు అగ్నిమాపక వాహనం సునాయాసంగా వెళ్లేలా మార్గం ఉండాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే జనం హైరానా పడకుండా సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి.

● పార్కింగ్ ప్రాధాన్యం

దుకాణాల సమీపానికి వాహనాలను అనుమతించకూడదు. దూరంగా పార్క్ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే వాహనాల వల్ల మరింత ఎక్కువ నష్టం సంభవించే అవకాశం ఉంది. వాహనాలు అడ్డుగా ఉంటే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోతారు. పైగా వాహనాల్లో ఉండే పెట్రోలు/డీజిలు వల్ల చిన్న ప్రమాదం పెద్దదిగా దారితీయవచ్చు. ఒకే దుకాణం వద్ద జనం గుమిగూడకుండా నియంత్రించడానికి కచ్చితంగా పోలీసులను నియమించాలి. ఫైర్ నిబంధనలు పాటించాలి.

జాగ్రత్తలతో ఆనందం



బాణసంచా నిల్వ, కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే దీపావళి ఆనందాన్ని ఇస్తుంది. ఏ మాత్రం చిన్న పొరబాటు జరిగినా విషాదమే. బాణసంచాను గ్యాస్ సిలిండర్లు, వాహనాలు, వంట గదుల్లో లేదా మండే స్వభావం ఉన్న వస్తువులు/పదార్థాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచవద్దు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు బాణసంచా కాల్చాలి. జిల్లాలోని అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. కానీ ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా బాణసంచా కాల్చుకోవాలి.

- మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక అధికారి, తూర్పుగోదావరి

అత్యుత్సాహానికి పోవద్దు : ఏడీఎఫ్‌వో



కాకినాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని యువత అత్యుత్సాహానికి పోకుండా పెద్దల సమక్షంలో బాణసంచాను కాల్చాలని, కాల్చే సామగ్రి బ్రాండెడ్ కంపెనీలవై ఉండాలని కాకినాడ సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సూచించారు. బాణసంచా కాల్చేటప్పుడు చేపట్టే జాగ్రత్తలపై ఆయన కొన్ని సూచనలు చేశారు. ముఖ్యంగా ఆరోజు కాటన్ వస్త్రాలను మాత్రమే ధరించాలి. పేలే బాణసంచాలను చిన్న పిల్లలు, వృద్ధులకు దూరంగా తీసుకుని వెళ్లికాల్చాలి. బాణసంచా తగినంత సూర్యరశ్మిలో మాత్రమే ఆరబెట్టాలి. పెద్దల సమక్షంలో మాత్రమే పిల్లలు బాణసంచా కాల్చాలి. ఇళ్ల వద్ద బాణసంచా కాల్చే సమయంలో డ్రమ్ముసీళ్ల సమీపంలో ఉంచుకోవాలి. రోడ్లపై నడిచే ప్రజలపైగానీ, బస్సులపైగానీ, ద్విచక్ర వాహనదారులపైగానీ బాణసంచా కాల్చకుండా జాగ్రత్తపడాలి. బాణసంచా అంటించిన తరువాత కాలలేదని నోటితో ఊదడం, తిరిగి అంటించే ప్రయత్నం అస్సలు చేయకూడదు. ఒకవేళ బాణసంచా పేలి గాయమైతే ఆ భాగంపై చల్లని నీళ్లు ధారగా పోయాలి. ఆయిల్‌గానీ, ఇంకుగానీ పోయరాదు. అనంతరం వైద్యుని వద్దకు తరలించాలి.

- సుబ్బారావు, కాకినాడ ఏడీఎఫ్‌వో




సురక్షితంగా పండగ చేసుకుందాం..

- పిల్లలను ఒంటరిగా దీపావళీ టపాసులు కాల్చకుండా చూడాలి. పెద్దలు వారి పక్కనే ఉండి వారిని గమనించాలి.
- టపాసులు కొన్ని పేలకుండా ఉండిపోతాయి. వాటిని తిరిగి వెలిగించే ప్రయత్నం అసలు చేయకూడదు.
- పేలకుండా ఉండే వాటిపై ఎప్పటికప్పుడు నీరు పోసి తడిపేయడం ద్వారా ఎవ్వరికీ హాని కలుగకుండా చూడొచ్చు.
- ఎక్కువ ధ్వనిని ఇచ్చే బాంబుల వల్ల చెవి సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. కాల్చేటప్పుడు చెవిలో దూది పెట్టుకోవాలి.
- దుస్తులపై నిప్పురవ్వలు మంటలుగా వ్యాపిస్తే వెంటనే దుప్పటితోగానీ, మందపాటి రగ్గులు, కంబళితో కప్పేసి మంటలను ఆర్పేయాలి. ఇలాంటి వాటిని దగ్గరగా పెట్టుకోవాలి.
- టపాసులతో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పిలిచేందుకు వీలుగా ఫైర్ సర్వీస్, అంబులెన్స్ పోలీస్ మొబైల్ టీమ్ ఫోన్ నంబర్లు రాసి పెట్టుకోవాలి.
- గాయాలయినప్పుడు ఐస్‌తో మర్దన చేయకూడదు. అలాగే వెన్న, గ్రీజ్, పౌడర్ వంటివి రాయకూడదు. - పెద్దాపురం

వసంత విలాసి.. దేవులపల్లి

● సాహిత్యంలో ఆయనకు ఆయనే సాటి..

● నవంబరు 1న జయంతి సందర్భంగా..



దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఆకులో ఆకునై.. కొమ్మలో కొమ్మనై.. నునులేతరెమ్మనై ఈ అడవి సాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా.. అంటూ తన భావ కవితా పటిమతో ప్రకృతి సౌందర్యాన్ని ప్రవచిస్తూ.. వాటికోసమే అహరహం పరితపించిన కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి.. వసంత విలాసిగా ఆయన చిరస్మరణీయుడు. కాకినాడ జిల్లాలో పుట్టిన ఆయన తన రచనలతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు. సినీ సాహిత్యంలోనూ తనదైన ముద్రవేశారు. మూడు దశాబ్దాలపాటు సినీ రంగంలో దేవులపల్లి తన హవా కొనసాగించారు. ఆయన పాటలు కోయిల గానంలా హాయిగా సంధ్యా సమయంలో గోదావరి గాలిలా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతటి కమ్మని.. నెమ్మని రచనలతో తనకంటూ ఓ శైలిని రూపొందించుకున్న ఆయన సదా సాహిత్య స్మరణీయుడు. 1897 నవంబరు 1న సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామంలో జన్మించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి తల్లిదండ్రులు దేవులపల్లి తమ్మన్నశాస్త్రి, సీతమ్మ. సాహిత్య రంగంలోనేగాక సినీ రచనల్లోను తన సాహిత్యాన్ని గుభాళించిన దేవులపల్లి ప్రముఖ రచయితల రచనలను తెలుగులోకి అనువదించి ఆంధ్రా షెల్లీగా ఎంతో పేరుగాంచారు. చిన్నతనం నుంచీ తండ్రి, పెదనాన్నల స్ఫూర్తితో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. ఆయన తన ప్రాథమిక విద్యను స్వగ్రామం రావువారిచంద్రంపాలెంలోను, ఉన్నత విద్యను దగ్గర్లోని పిఠాపురంలోను, డిగ్రీని 1918లో విజయనగరం డిగ్రీ కళాశాలలోను పూర్తిచేశారు.

భావకవితోద్యమ ప్రచారకుడిగా..

ప్రముఖ కవులు కూచి నరసింహారావు, రఘుపతి వెంకటరత్నంనాయుడు ప్రోత్సాహంతో దేవులపల్లి ఆంగ్ల సాహిత్యాన్ని అధ్యయనం చేసి బ్రహ్మసమాజంపట్ల ఆకర్షితులయ్యారు. ఆంగ్ల సాహిత్యం, వంగ సాహిత్యంపట్ల కూడా బాగా ఆకర్షితులయ్యారు. ఈ ప్రభావంతోనే కృష్ణపక్షం సంపుటిని రాశారు. 1920 నుంచి 1935 వరకూ ఆయన చాలామందిపై ప్రభావం చూపారు. 1922లో భార్యా వియోగంతో కన్నీరు అనే ఖండకావ్యం, ఊర్వశి, ప్రవాహం రాశారు. పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కృష్ణశాస్త్రి సంస్కరణోద్యమం, బ్రహ్మసమాజం, నవ్య సాహితీ సభ్యులుగా భావకవితోద్యమ ప్రచారకుడిగా దేశమంతా పర్యటించారు. కృష్ణశాస్త్రి స్త్రీ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. 1933-1941 మధ్యకాలంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేశారు.

సినీరంగ ప్రవేశం

1942లో చలనచిత్ర పరిశ్రమలో చిత్ర నిర్మాత బీఎన్‌రెడ్డి ప్రోత్సాహంతో దేవులపల్లి చిత్రసీమలో అడుగుపెట్టారు. అప్పటికే ఆయనకు 1929లో రవీంద్రనాథ్ ఠాగూర్‌తో సాన్నిహిత్య సంబంధాలు ఏర్పడ్డాయి. 1951లో మల్లీశ్వరి చిత్రంలో ఆయన రాసిన ప్రతి పాటకూ ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. మొత్తం 25 సినిమాలకు ఆయన పాటల రచయితగా 170 పాటలు రచించారు. ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవూ, మనసున మల్లెలు మాలలూగెనే వంటి గీతాల పునాదులపై ఆయన చిత్రజీవితం పాటలా సాగింది. దేవులపల్లి సుకుమార.. సుందర.. సుమధుర.. లలిత.. మనోహర భావాలతో సినీ సామ్రాజ్యాన్ని ఏలారు. 1945 నుంచి హైదరాబాద్ ఆకాశవాణిలో గేయాలు, బాలగేయాలు, కార్మిక గీతాలు, భక్తిగీతాలు అశేష సంఖ్యలో రచించారు. దేవులపల్లి రచించిన గోదాకళ్యాణం, ధనుర్దాసు, వేణుం కుంజా, వసంతోత్సవం నాటకాలు ఎంతో ప్రసిద్ధి.

సొంతిల్లు పాఠశాలకు..

దేవులపల్లి తన జన్మస్థలం రావువారిచంద్రంపాలెంలో అందరినీ విద్యావంతులను చేయాలన్న ప్రగాఢ కాంక్షతో తన సొంతింటిని పాఠశాల నిర్వహణకు ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారు. ఆయన ఇంటి ఆవరణలోనే ఇప్పటికీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తుండడం గర్వకారణం. ఈ ఇంటి ఆవరణలో ఆయన అభిమానులు నిలువెత్తు దేవులపల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2004లో అప్పటి కలెక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. దేవులపల్లి చివరిరోజుల్లో సైతం గోరింట పూచింది.. కొమ్మలేకుండా తెలుగుపాటకు అందం దిద్దారు. దేవులపల్లి రాసిన జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రీ.. అనే గీతం జాతీయ గీతం అన్ని అర్హతలు ఉన్న గీతంగా గుర్తింపు పొందింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతోనూ, కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తోనూ దేవులపల్లిని సత్కరించాయి. 1966లో ఆయన కంఠం మూగబోయింది. అయినప్పటికీ తన రచనలు కొనసాగించారు. 1980 ఫిబ్రవరి 24న ఆయన తుదిశ్వాస విడిచారు. దేవులపల్లి మరణించి నేటికి 44ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం సరైన రీతిలో గుర్తించకపోవడం విచారకరం. ఈ ప్రాంతానికి శాసనసభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హయాంలోనైనా ప్రభుత్వం తరఫున కృష్ణశాస్త్రికి, స్వగ్రామం రావువారిచంద్రంపాలేనికి తగిన గుర్తింపు ఇస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. - ఆంధ్రజ్యోతి/సామర్లకోట











తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పేదల జీవితాలపై పిడుగు

» బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి భారీ విస్ఫోటనం
» ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు.. తణుకు, ఏలూరు ఆసుపత్రిలకు తరలింపు
» పొలాల్లోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్న తొమ్మిది మంది కార్మికులు
» హాహాకారాలతో దద్దరిల్లిన ఘటనా స్థలం.. ఆస్పత్రి ప్రాంగణం
» తూ.గో.జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో ఘటన..
» మృతులది వెంకట్రాయపురం, రావిపాడు

ఉండ్రాజవరం/తణుకు/పెంటపాడు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతా రోజు కూలీలు. పనికి వెళితే తప్ప పూట గడవని కుటుంబాలు. దీపావళి వేళ.. అందరి ఇళ్లల్లోనూ వెలుగులు పంచాలనుకున్నారు. కాని, వారి కుటుంబాలపై పిడుగు పడి.. చీకట్లు అలుముకున్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో దీపావళి మందులు తయారీ చేసే షెడ్డు పక్కన వున్న కొబ్బరి చెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. పక్కనే ఈ షెడ్డులో కార్మికులు చిచ్చుబుడ్లు, తారాజువ్వలు తయారు చేస్తున్నారు. ఈ పిడుగు కారణంగా ఇక్కడ భారీ విస్ఫోటనం సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఓ వైపు పిడుగుపాటు శబ్దం, మరోవైపు బాణసంచా పేలుడుతో అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా ఇద్దరు మహిళలు కాలి బూడిదయ్యారు. మరో ఐదుగురి కాలిన గాయాలతో హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. అక్కడే పనిచేస్తున్న మరో తొమ్మిది మంది వెంటనే తేరుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు పక్కనే వున్న పంట పొలాల్లోకి పరుగులు తీశారు. ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన కార్మికురాలు గుమ్మడి సునీత(38), బాణసంచా తయారీ యజమాని భార్య, తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన వేగరోతు శ్రీవల్లి(35) అక్కడక్కడే మరణించారు. దువ్వకు చెందిన కడిమి కుమారి, చుక్కా పెద్దింట్లు, పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మందలంక కమలరత్నం, సీలం లక్ష్మి, జంగారెడ్డిగూడెంకు చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి వచ్చిన గ్రామస్తులు వీరిని రక్షించే ప్రయత్నం చేశారు. కాలిన గాయాలతో బాధితులు హాహాకారాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సుమారు గంటపాటు వర్షం పడటంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బంది కలిగింది. ఈలోగా తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ గుబ్బల శ్రీనివాసరావు, సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తన జీపులో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం

క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రుల హాహాకారాలు, వారి బంధువుల రోదనలతో ఈ ప్రాంగణం మిన్నంటింది. వీటి మధ్యే వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణతో ఆరిమిల్లి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి ఫోన్ చేసి విషయం వివరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఆదుకుంటామన్నారు.

పొట్టకూటి కోసం వచ్చిన వారే

బాణసంచా తయారీకి వచ్చిన వారంతా నిరుపేదలే. పొట్టకూటి కోసం వచ్చిన వారే. కొందరు నెల, మరికొందరు రెండు నెలలుగా పని చేస్తున్నారు. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన గుమ్మడి సునీత(38), మందలంక కమల రత్నం, శీలం లక్ష్మి కొద్ది రోజులుగా రోజూ పనికి వెళ్లి వస్తూ వుంటారు. సునీతకు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉండగా, లక్ష్మీకి భర్త దుర్గారావు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా తయారీ నిర్వాహకుడు శివకు వ్యాపారంలో తోడుగా ఉండేందుకు ఆయన భార్య శ్రీవల్లి పది రోజులుగా అక్కడకు వెళుతోంది. వీరికి కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది.



పిడుగు పడడంతో దగ్ధమైన కొబ్బరి చెట్టు

జేసీ ఘటనా స్థలం పరిశీలన

తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన రామ్‌శివాజీ రెండేళ్లుగా చిచ్చుబుడ్డీలు, తారాజువ్వలు తయారు చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో 16 మంది బాణసంచా తయారు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జేసీ చినరాముడు, ఆర్డీవో రాణిపద్మజ పరిశీలించారు. రామ్‌శివాజీతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసే వారంతా పేదలేనని, జీవనోపాధి కోసం దూర ప్రాంతం నుంచి ఇక్కడకు 18 మంది వచ్చి చిరు జీతానికి పనిచేస్తున్నారని చెప్పారు. కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. ఈ రోజు 16 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. మృత్యువు పిడుగు రూపంలో వచ్చి తన భార్య శ్రీవల్లి, మరో మహిళను కోల్పోయామని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదంలో ఇద్దరు మహిళలు మరణించడం బాధాకరమని జేసీ చెప్పారు. మృతులకు ప్రభుత్వ సహాయ సహకారాలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పన ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.



క్షతగాత్రులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మందుగుండు సామగ్రి



తీవ్ర గాయాలతో బాధపడుతున్న మహిళ



టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎంపికైన నెహ్రూకు స్వీట్ తినిపిస్తున్న భార్య మణమ్మ

టీటీడీ బోర్డు సభ్యుడిగా
జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడి గా ఎంపికయ్యారు. ఈమేరకు మంగళగిరి నుం చి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా వీరిలో నెహ్రూ ఒకరు. ఆయన ఎంపిక పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్ల నుంచి జ్యోతుల నెహ్రూ ఆధ్యాత్మికం వైపు నడుస్తూ దేశంలో ఉన్న అనేక శివ, వైష్ణవ క్షేత్రాలతోపాటు అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవడంతోపాటు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆలయానికి అనేకసార్లు వెళ్లి దర్శించుకున్నారు. తన స్వగ్రామం జగ్గంపేట మండలం ఇర్రిపాకలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల ఎన్నికల్లో నెహ్రూ నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా రు. కాగా, కాకినాడ జిల్లాకు సంబంధించి గతంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న పిల్లి అనంతలక్ష్మికి టీటీడీ బోర్డు సభ్యురాలి పదవి వరించింది. ప్రస్తుతం జ్యోతుల నెహ్రూకు టీటీడీ బోర్డు సభ్యుడి పదవి ఇవ్వడంపట్ల ఆయన ఇంట సందడి నెలకొంది. స్థానికంగా ఉన్న పోలీసులు, నేతలు ఆయన్ను కలిసి అభినందిస్తున్నారు. నెహ్రూ సతీమణి మణమ్మ ఆయనకు స్వీట్ తినిపించి ఆనందం పంచుకున్నారు.

టీటీడీ బోర్డు మెంబర్‌గా
అక్కిన ముని కోటేశ్వరరావు

● రాజమహేంద్రవరానికి చోటు



రాజమహేంద్రవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బోర్డు మెంబర్‌గా రాజమహేంద్రవరం నగరానికి చెందిన అక్కిన ముని కోటేశ్వరరావు నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులలో భాగంగా టీటీడీ బోర్డు పాలకవర్గాన్ని బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో రాజమహేంద్రవరానికి కూడా గౌరవం దక్కింది. ముని కోటేశ్వరరావు స్వగ్రామం సీతానగరం మండలంలోని రఘుదేవపురం. కాంట్రాక్టర్‌గా ఎదిగారు. కానీ రాజమ హేంద్రవరంలోనే నివాసం. రాజకీయాలకు అతీతంగా అందరితో సన్నిహితంగా ఉంటే ముని కోటేశ్వరరావు ప్రజాసేవలో కూడా ముందుంటారు. సీతానగరం మండలంలో రాజంపేటలో మంచినీటి సౌకర్యం ఏర్పాటుచేసి మునికూడలి, వెదుళ్లపల్లి గ్రామాలకు కూడా ఉపయోగపడేటట్టు చేశారు. రఘుదేవపురంలో కూడా మంచినీటి సౌకర్యం కల్పించారు. వేంకటేశ్వరస్వామి, పద్మావతి ఆలయాలు కూడా నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామివారికి సేవచేసే భాగ్యం లభించడంసంతోషాన్ని కలిగించిందని చెప్పారు.

● గోరంట్ల అభినందనలు

టీడీపీ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన నాయుడు, సభ్యులుగా నియమితులైన జ్యోతుల నెహ్రూ, అక్కిన ముని కోటేశ్వరరావుకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అభినందనలు తెలిపారు. స్వామికి సేవ చేసే అవకాశం వారికి లభించడం సంతోషకరమన్నారు.


వెండి పాదుకలు సమర్పిస్తున్న దాతలు

తలుపులమ్మ అమ్మవారికి వెండి పాదుకల సమర్పణ

తుని రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం లోవ క్షేత్రంలో వేంచేసియున్న తలుపులమ్మ అమ్మవారికి గుంటూరుకు చెందిన ఆలూరి అనూరాధ-శశిధర్ దంపతులు సుమారు రూ.1.30 లక్షలు విలువ చేసే మూడు వెండి పాదుకలను తయారు చేయించారు. బుధవారం ప్రత్యేక పూజల అనంతరం వీటిని ఆలయ అధికారులకు అందజేసి అమ్మవారి పూజకు వినియోగించాలని కోరారు. దాతలను వేద పండితులు శేషవస్త్రాలతో సత్కరించి అమ్మవారి మహాప్రసాదం అందజేశారు.




హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.22 కోట్లు

అన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. రూ.1,22,41,967 నగదు, 10.5 గ్రాముల బంగారం, 410 గ్రాముల వెండి లభించాయి. 117 యుఎస్‌ఏ డాలర్లు, 220 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 105 యుఏఈ దిరహమ్స్, 100 యూరోలు, సెంట్రల్ బ్యాంక్ ఖతర్ 109 రియల్స్ భక్తులు సమర్పించుకున్నారు. 30 రోజులకు ఈ ఆదాయం వచ్చింది. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది పాల్గొన్నారు.


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, సేవాదళ్ సభ్యులు

బాలబాలాజీ హుండీల ఆదాయం రూ.35 లక్షలు

మామిడికుదురు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. 98 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.35,00,622, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.52,096, 8 గ్రాముల బంగారం, .120 గ్రాముల వెండి లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి రాగోలు శ్రీనివాస్ ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, స్థానికులు లెక్కింపులో పాల్గొన్నారు.



ఏఎస్పీ ఎదుట లొంగిపోయిన సుక్కి

మావోయిస్టు దళ సభ్యురాలు లొంగుబాటు

చింతూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు సోడి సుక్కి బుధవారం చింతూరు పోలీసుల ఎదుట లొంగిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతగుప్ప పోలీసు స్టేషన్ పరిధిలోని దులోడ్ గ్రామానికి చెందిన సుక్కి మూడేళ్ల క్రితం మావోయిస్టు పార్టీలో చేరింది. పార్టీ అప్పజెప్పిన బాధ్యతల్లో భాగంగా టైలరింగ్ టీంలో పని చేసింది. అనంతరం ఆమెకు శిక్షణ ఇచ్చి పదోన్నతి కల్పించి అగ్రికల్చర్ టీంకు బదిలీ చేసింది. 2023లో మెట్టగూడెం అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల నడుమ జరిగిన కాల్పుల్లో సుక్కి పాల్గొంది. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పలు విధానాలకు విసుగు చెందడంతో పాటు పోలీసులు చేపడుతున్న పరివర్తన కార్యక్రమంలో భాగంగా సుక్కి పోలీసుల ఎదుట లొంగిపోయింది. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు యువకులు!

మహిళ అనుమానాస్పద మృతి కేసు

కడియం, అక్టోబరు 30: మహిళ అదృశ్యమై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నలుగురు అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన రైతు కస్తూరి (43) ఈ నెల 15న అదృశ్యమైంది. దీనిపై ఆ మర్నాడు భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 17న కస్తూరి మృతదేహం చొప్పెల్ల లాకుల వద్ద లభ్యమైంది. ఆమెకు గుండుకొట్టి ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టు తెలిసింది.


కస్తూరి (పాత చిత్రం)


నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేస్తున్న బాలికల వసతిగృహం విద్యార్థినులు

ఈ భోజనం మాకొద్దు

అన్నంలో పురుగులు
సరిగా ఉడకని కూరలు..
తాగునీరు అంతంతమాత్రం
పెరుగు సైతం బాగోట్లేదు
ఫిర్యాదు చేసినా పట్టించుకోని వర్సిటీ అధికారులు
నాలుగు రోజులుగా భోజనం తినలేదు
నన్నయ యూనివర్సిటీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ధర్నా
సమస్యల పరిష్కారానికి కమిటీలు వేయాలి: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికల వసతిగృహంలో పురుగులతో, మాడిన పదార్థాలతో పెడుతున్న భోజనం చేయలేకపోతున్నామని, మంచి భోజనం అందించాలని డిమాండ్ చేస్తూ ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలోని బాలికల వసతిగృహం విద్యార్థినులు బుధవారం ధర్నా చేశారు. వన్ వాయిస్, వన్ డిమాండ్, గుడ్‌ఫుడ్ అన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ మండుటెండలో విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. ఉదయం సుమారు 9:30 గంటలకు ఆందోళన చేపట్టడంతో వర్సిటీ లోపలికి వెళ్లేందుకు ఉద్యోగులకు వీలు లేకుండా పోయింది. కొంతమంది గేటు బయటే ఉండిపోయారు. సమాచారం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ యూనివర్సిటీ వద్దకు చేరుకున్నారు. వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సమక్షంలో విద్యార్థులతో మాట్లాడారు. ఆందోళన విరమించి సమస్యలను వివరించాలని, ఇరువర్గాలతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో విద్యార్థినులు 11 గంటల ప్రాంతంలో ఆందోళన విరమించారు.

అనంతరం ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్లో విద్యార్థులు, వర్సిటీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహంలో సరైన నీటి సదుపాయం లేదని, పరిశుభ్రత లేదని, అన్నం, కూరలు, పెరుగు సైతం బాగోట్లేదన్నారు. తినే అన్నంలో పురుగులు వస్తున్నాయని, భోజనం సరిగా వండట్లేదని ఏకరువు పెట్టారు. రాత్రిళ్లు అనారోగ్యం వస్తే వైద్యం చేసేందుకు యూనివర్సిటీలో కనీసం ఒక నర్సు కూడా అందుబాటులో ఉండట్లేదని వాపోయారు. తినడానికి వీల్లేకుండా ఉన్న ఆహారాన్ని ఈ నెల 23న తీసుకువెళ్లి వీసీకి చూపించామని, ఆయన తమకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారన్నారు. నాలుగు రోజులుగా తిండి కూడా తినలేదని వాపోయారు. ఈ సమస్యలను తాము విశ్వవిద్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించకపోగా వార్డెన్ తమతో బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారన్నారు. బాలుర హాస్టల్ కంటే ప్రతినెలా తామే ఎక్కువ సొమ్ము చెల్లిస్తున్నామని విద్యార్థినులు చెప్పారు. వంట వారిలో సీనియర్ సిటిజన్లు ఎక్కువ ఉన్నారన్నారు.

యూనివర్సిటీలోని బాలికల వసతిగృహంలో సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థినులు, వర్సిటీ అధికారులతో రెండు కమిటీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. హాస్టల్ విద్యార్థినుల సంక్షేమానికి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలో 24 గంటలూ విద్యార్థినులకు ఒక నర్సు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. రాత్రిళ్లు పెట్రోలింగ్ చేయాలని పోలీసులకు తెలిపామన్నారు. తాను వారానికి ఒకసారి యూనివర్సిటీ హాస్టల్‌ను సందర్శిస్తానన్నారు. విశ్వవిద్యాలయంలో పరిశుభ్రత తదితర అంశాలపై రిజిస్ట్రార్ సుధాకర్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ కమిటీలను వేస్తామని, కుక్‌ను మార్చాలన్న ప్రధాన డిమాండ్‌పై వీసీతో చర్చిస్తామన్నారు. సమావేశంలో వర్సిటీ అధికారులు డి.జ్యోతిర్మయి, ఎస్.ఉదయభాస్కర్ ప్రిన్సిపాల్స్, కె.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు, రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ సత్యసాయి, జనసేన నాయకులు దేశాల శ్రీను, గళ్లా రంగా, వై.శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థినులు, విశ్వవిద్యాలయ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



మరణించిన లేగ దూడ, దుక్కుటెద్దు

మన్యం పులి గర్జన

కూనవరం మండలంలో ఒకే రోజు రెండు పశువులను చంపిన వైనం

కూనవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మన్యంలో పెద్ద పులి గర్జించింది. ఒకేరోజు రెండు పశువులను చంపి అటు ప్రజలను, ఇటు అధికారులను భయభ్రాంతులకు గురిచేసింది. కూనవరం మండలం బోదునూరు అడవిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకేరోజు రెండు గంటల వ్యవధిలో రెండు పశువులను చంపడంతో గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

కళ్లెదుటే పశువులను చంపిన పులి

సాధారణంగా గిరిజనులు తమ పశువులను రాత్రివేళ ఊరు శివారున ఉన్న అడవుల్లో కట్టేస్తారు. చుట్టూరా తడికెలు పెట్టి పశువులను అందులో ఉంచుతారు. బోదునూరుకు చెందిన సోడే శ్రీను కుమారుడు విష్ణు బుధవారం యథావిధిగా పశువులను మేపడానికి వెళ్లాడు. పాక దగ్గరకు వెళ్లి పశువుల తాడు విప్పే ప్రయత్నం చేశాడు. ఒక పశువు పాకకు దూరంగా ఉండడంతో దాని దగ్గరకు వెళ్లి లేపే ప్రయత్నం చేశాడు. ఇంతలో దగ్గర్లోని పొదలో దాగివున్న పులి ఒక్కసారిగా గర్జించి పైకి లేచింది. దీంతో విష్ణు అక్కడి నుంచి పరుగులు తీశాడు. ఇంతలో పులి ఆ పశువును కొంత దూరం లాక్కుని వెళ్లి అక్కడ ఉన్న నీళ్లలో వదిలేసింది. దీనిని దూరం నుంచి గమనించిన విష్ణు ఒక్కసారిగా ఊళ్లోకి పరుగు తీసి తండ్రితో పాటు గ్రామ పెద్దలకు విషయం తెలపగా వారు అటవీ శాఖాధికారులకు సమాచారమిచ్చారు. అటవీ శాఖాధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని పశు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన తుష్టి జోగయ్య పశువులను తోలుకుని అడవిలోకి వెళ్లాడు. మొదటి సంఘటన జరిగిన గంట వ్యవధిలోనే పులి మరోసారి అక్కడున్న పశువుల మందపై దాడి చేసింది. లేగ దూడ తలపైకి దూకి చంపివేసింది. దీనిని ప్రత్యక్షంగా చూసిన జోగయ్య అక్కడి నుంచి భయంతో పరుగులు పెట్టాడు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరించారు. చనిపోయిన పశువులకు ఎక్స్‌గ్రేషియా ఇస్తామన్నారు.


పులి పశువును చంపుతుండగా ప్రత్యక్షంగా చూసిన జోగయ్య

పులి సమాచారం ఇచ్చిన గిరిజన బాలుడికి చాక్లెట్ ఇచ్చి అభినందించిన డీఎఫ్‌వో



తొలి సంఘటనా స్థలానికి డీఎఫ్‌వో బబిత చేరుకున్నారు. పులి సమాచారాన్ని ధైర్యంగా చెప్పి ప్రజల ద్వారా అటవీ శాఖాధికారులకు సమాచారం తెలియజేసిన గిరిజన బాలుడు సోడే విష్ణును ఆమె అభినందించారు. అతడి ధైర్యానికి మెచ్చుకుని చాక్లెట్ ఇచ్చారు. పులి కనిపిస్తే ప్రతి ఒక్కరూ ఇలా అధికారులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లోకి వచ్చిన పులిని సురక్షితంగా దట్టమైన అటవీ మార్గంలోకి పంపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు పులి జాడ కోసం రాత్రివేళలో సైతం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇందుకు ఒక కమిటీ వేశామన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ బయటకు రావొద్దని సూచించారు.

లక్ష్మీపురం పీహెచ్‌సీలో వ్యక్తి వీరంగం

ఎటపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీ వెనుక నివాసముండే ఓ వ్యక్తి మంగళవారం రాత్రి వీరంగం సృష్టించాడు. రాత్రి 11 గంటల సమయంలో పీహెచ్‌సీలోకి వచ్చి రాత్రి వేళ తలుపులు ఎందుకు క్లోజ్ చేస్తున్నారని, 24 గంటల డ్యూటీలో ఉండే సిబ్బంది స్పందించట్లేదని వైద్య సిబ్బందిపై చిందులు తొక్కాడు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సు సీత, వాచ్‌మన్ వారిస్తున్నా పట్టించుకోకుండా చిర్రెత్తిపోయాడు. ఆసుపత్రి ప్రవేశ తలుపులను పదేపదే గోడకేసి గట్టిగా కొడుతూ ధ్వంసం చేశాడు. పక్కనే ఉన్న బీపీ, వేయింగ్ మిషన్లను కూడా ధ్వంసం చేశాడు. సుమారు గంటసేపు హల్‌చల్ చేశాడు. సదరు వ్యక్తి మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడినట్టు తెలుస్తోంది. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు సీత, వాచ్‌మన్‌లను భయభ్రాంతులకు గురిచేశాడు. కొందరు ఎంత నచ్చజెప్పినా వినకుండా దౌర్జన్యంగా సామగ్రిని పగలగొట్టాడు. ఈ ఘటనపై వైద్య సిబ్బంది బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.


సరస్వతి, స్వాతి (పాత చిత్రాలు)

మానసిక స్థితి సరిగా లేకే!

తల్లీ, కూతుళ్ల ఆత్మహత్య ఘటనలో వెలుగులోకి మరిన్ని విషయాలు
వివాహ విషయంలో తలెత్తిన వివాదం
తండ్రి కలలోకి వచ్చి తన దగ్గరకు వచ్చేయమన్నాడంటూ ఇటీవల బావకు ఫోన్

కాకినాడ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన తల్లీకూతుళ్లు కాకినాడలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలిసిందే. వారిద్దరి మృతదేహాలకు జీజీహెచ్ మార్చురీలో బుధవారం పోస్టుమార్టం పూర్తయింది. కాకినాడ వార్పు రోడ్డులోని పెంకే వారి వీధి వాసవీ కల్యాణ మండపం సమీపంలోని ఓ ఇంట్లో ఆకాశం సరస్వతి (60), ఆకాశం స్వాతి (28) ఉంటున్నారు. స్వాతి పెళ్లి విషయంలో వివాదం తలెత్తి ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. సరస్వతి భర్త నరసింహరావు 15ఏళ్ల క్రితం మరణించాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె హారిక లక్ష్మీ దుర్గాప్రభ వివాహమై భర్త సత్యభాస్కర్‌తో కలిసి విశాఖపట్నంలో ఉంటోంది. చిన్న కుమార్తె స్వాతి టైలరింగ్ చేస్తూ ఇంటి వద్దే ఉంటోంది. తల్లి, చిన్న కూతురు మానసిక పరిస్థితి కొన్నాళ్లుగా సరిగా లేదని భావిస్తున్నారు. ఇటీవల తండ్రి కలలోకి వచ్చి తన వద్దకు వచ్చేయమని అన్నట్టుగా స్వాతి భావించింది. ఇటీవల తన బావ సత్యభాస్కర్‌కు ఫోన్ చేసి తన తండ్రి పేరున జ్ఞాపకార్థంగా భోజనాలు పెట్టాలని చెప్పింది. ఇందుకుగాను అతడు స్వాతికి రూ.20వేలు ఫోన్ పే చేశాడు. ఆమె రూ.13వేలు వెనక్కి పంపింది. రేపటికి అమ్మ, నేను ఈ భూమ్మీద ఉండమని అక్క హారికకు ఫోన్ చేసి చెప్పింది. ఈ నేపథ్యంలో తర్వాతి రోజే తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కానీ ఈ విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో యజమాని గుర్రాల శ్రీనివాస్ గమనించి కిటికీలను తెరిచి చూడగా తల్లీకూతుళ్లు విగతజీవులుగా చీరలకు వేలాడుతూ కనిపించారు. అతడి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు కేసు నమోదు చేసి సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బుధవారం ఫోరెన్సిక్ వైద్యులు పోస్ట్‌మార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లూరు సర్వారాయ షుగర్స్ డిస్టిలరీలో సీఐడీ సోదాలు

రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం చెల్లూరు సర్వారాయ షుగర్స్‌లోని డిస్టిలరీ యూనిట్‌లో సీఐడీ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు జరిపారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించినట్టు తెలిసింది. తనిఖీల సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అధికారులు ఎటువంటి వివరాలు వెల్లడించలేదు.

అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి



ఆలమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద కోరంగి ప్రధాన కాలువలో స్నానానికి దిగిన ఆలమూరుకు చెందిన అయ్యప్ప భక్తుడు సి.విజయ్‌కుమార్‌పై నీటి పిల్లి దాడి చేసింది. చేతి మీద, కాలు మీద గాయపరిచింది. ఆయన ఆలమూరు సీహెచ్‌సీలో వైద్య సాయం పొందారు. దాడి చేసినట్టు భావిస్తున్న నీటి పిల్లి చిత్రాన్ని ఆయన గూగుల్‌లో చూపించారు. కాగా ఈ విషయం చర్చనీయాంశమైంది. నీటి పిల్లి దాడిలో గాయపడితే రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.అనిత తెలిపారు. నీటి పిల్లులు గోదావరి, ప్రధాన కాలువల్లో సంచరిస్తుంటాయని, ఇవి ఎవరిపైనా దాడి చేయవన్నారు.


గాయపడిన విజయ్ కుమార్

అమలాపురం

పంచారామ యాత్రకు ప్రత్యేక బస్సులు

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సందర్భంగా భక్తుల కోసం అమలాపురం ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. పంచారామ యాత్ర కోసం ప్రత్యేక బస్సులు అమలాపురం డిపో నుంచి ప్రతీ ఆదివారం రాత్రి 7గంటలకు బయలుదేరతాయన్నారు. నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.950, అల్ట్రా డీలక్స్‌కు రూ.1170, సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1220గా టిక్కెట్ ధరలను నిర్ణయించామన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉన్నట్టయితే ఏ రోజైనా బస్సును పంపిస్తామన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని డిపో మేనేజర్ తెలిపారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి గ్రామానికి చెందిన కర్రి బుద్దేశ్వరరావు నవంబరు 10న గుజరాత్‌లో జరిగే స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్చరీ కాంపౌండ్ అండర్-17 పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు.

అర్హులందరికీ కేంద్ర సంక్షేమ పథకాల లబ్ధి

ఎంపీ హరీష్‌మాధుర్


దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అమలాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల లబ్ధి అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి అందించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కోనసీమ జిల్లా అభివృద్ధి సమన్వయ, జిల్లా పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రగతిని సమీక్షించారు. వైద్య ఆరోగ్య శాఖ పరంగా కేంద్రం అందిస్తున్న పథకాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర వివరించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో క్రీడలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో ఉన్న జీఎంసీ బాలయోగి స్టేడియాన్ని రూ.42కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసేందుకు సమగ్ర నివేదికను రూపొందించామన్నారు. కేంద్రం ఖర్చు చేస్తున్న ప్రతీ పైసా నిరుపేదలకు చేరాలన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం ఎదగాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిర్దేశిత వర్గాలవారి జీవన ప్రమాణాలు, జీవనోపాధులను మెరుగుపరచాలన్నారు. వికసితభారత్-2047 లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయన్నారు. జిల్లాలో యువతకు ఉపాధి చూపడం వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ కుళాయి అందించి రక్షిత మంచినీటిని అందించాలన్నారు. చిరుద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కేంద్ర పథకాల ద్వారా కృషి చేయాలన్నారు. ముద్రా రుణాల పరిమితిని కేంద్రం రూ.20లక్షల వరకు పెంచిందన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీ స్థాయిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీల సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. మూడు నెలలకొకసారి దిశ కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం లేకుండా పోయిందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొనగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందించారు. ఏరియా ఆసుపత్రిలోని సమస్యలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వంద పడకల ఆసుపత్రిగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, గిడ్డి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. జాయింట్‌కలెక్టర్ టి.నిషాంతి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

మలికిపురం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): 61వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ బ్యాడ్మింటన్ ఇండివిడ్యువల్స్‌లో అండర్-14 బాలుర విభాగంలో ఎస్.హేమంత్‌శ్రీ పశ్చిమగోదావరి జిల్లా, పి.రోషన్ గుంటూరు, డీవీవై నాథ్ అనంతపురం, వైఈ అఖిల్ ప్రకాష్ కర్నూలు, కె.ఈశ్వరసాయి అనంతపురం, అదే విధంగా అండర్-17 బాలుర విభాగంలో కె.మహేంద్ర నెల్లూరు, బి.అభిషేక్ తూర్పుగోదావరి, కె.శ్రీకర్ తూర్పుగోదావరి, వై.గౌతమ్‌కుమార్ తూర్పుగోదావరి, వి.హరికృష్ణ తూర్పుగోదావరి ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో డీవీవై సిరి అనంతపూర్, ఐ.తన్వి కృష్ణాజిల్లా, ఎన్.సాహితీశ్రీ తూర్పుగోదావరి, ఎస్.కావ్య కృష్ణాజిల్లా, జి.సుష్మారెడ్డి నెల్లూరు, అదే విధంగా అండర్-17 బాలికల విభాగంలో వై.వైష్ణవి విశాఖపట్నం, డి.సంజన విశాఖపట్నం, ఆర్.యశ్వితసాయి కృష్ణాజిల్లా, డి.తేజస్విని కృష్ణాజిల్లా, జె.నక్షత్ర అనంతపూర్ ఎంపికయ్యారు. వీరంతా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కార్యదర్శి ఏవీ శ్రీనివాస్ తెలిపారు.

కిట్లు పంపిణీ

యానాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యానాం వృద్ధాశ్రమ సిబ్బందికి ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు దీపావళి కిట్లు అందజేశారు.

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్య భద్రతకు 'బీమా'

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న 55ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, జూనియర్ కళాశాలల విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ఐసీఐసీఐ లాంబార్డ్ బీమా సదుపాయానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఇన్సూరెన్సు ప్రతినిధులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు అనారోగ్యం పాలైన సందర్భాల్లో నర్సులు ప్రాథమిక చికిత్సలు నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగిస్తారన్నారు. ఆ పరిస్థితుల నుంచి బయటకు తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద విద్యార్థులను ఆదుకునేందుకు బీమా సదుపాయం కల్పించనున్నట్టు చెప్పారు. వసతి గృహ, జూనియర్ కళాశాలల విద్యార్థుల వివరాలను నెట్‌వర్క్ ఆసుపత్రులకు మ్యాపింగ్ చేస్తూ వారి డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్టు చెప్పారు. ఆధార్ ఆధారంగా ఆసుపత్రి యాజమాన్యాలు చికిత్సలు అందించి అందుకయ్యే బిల్లులను ఇన్సూరెన్సు కంపెనీ వెబ్‌సైట్‌లో పొందు పరుస్తారన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్ కంపెనీ ఆ బిల్లులను ధ్రువీకరించి నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో బీమా అధికారి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తీక్, ఇన్సూరెన్సు కంపెనీల ప్రతినిధులు, నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నాయి.

రీజెన్సీ పెండింగ్ అంశాలపై గవర్నర్‌తో భేటీ

యానాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించిన పలు పెండింగ్ అంశాల పరిష్కారం కోసం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశ్‌నాథ్‌తో రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు సమావేశమయ్యారు. ఈమేరకు రీజెన్సీకి సహజ వాయువు సరఫరా అంశం, పెండింగ్ అంశాలను పరిష్కరించాలని గవర్నర్‌ను కోరారు. దీనిపై అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి అన్ని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని గవర్నర్ తెలిపినట్లు జీఎన్ నాయుడు తెలిపారు. సమావేశంలో రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తీరంలో చేపల వేటాడుతూ మత్స్యకారుడి మృతి

అల్లవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం పంచాయతీ నక్కారామేశ్వరం మొగ తీరంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు అలలకు వలలో చిక్కుకుని మృతిచెందాడు. రామేశ్వరానికి చెందిన పంతాడి సత్యనారాయణ(51) బుధవారం చేపల వేటకు వెళ్లి తీరంలో మృతిచెందగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సత్యనారాయణ భార్య మంగ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

కంద దీపం కోసం 22 కిలోల మహాకంద

అమలాపురంటౌన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): వరాల జల్లు కురిపించే వారాహీ కంద దీపాన్ని దీపావళి అమావాస్య గురువారం రాత్రి 8గంటలకు ప్రజ్వరిల్లిస్తున్నట్టు అక్షయపాత్ర ప్రతినిధి సలాది వెంకటసాయిరామ్ తెలిపారు. అమలాపురం విద్యుత్‌నగర్‌లోని ఆదిశేషా నిలయంలో నిర్వహిస్తున్న ద్వాదశ రాత్రి నవదుర్గ అఖండ హోమపూజా మహోత్సవాల్లో భాగంగా 22కిలోల మహాకందను ఆయన అందించారు. కందపై కొంత భాగాన్ని తొలగించి ఆవునేతితో నింపి దీపాన్ని వెలిగిస్తామని, కార్తీకమాసం కంద దీపం అఖండంగా వెలుగుతుందన్నారు.

ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటించాలి

ముమ్మిడివరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటను దళారుల చేతిలో మోసపోకుండా గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ మోకా ఆనంద్‌సాగర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, రైతు సేవా కేంద్రాల ధాన్యం కొనుగోలు సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆనంద్‌సాగర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాపౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.బాలసరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ధాన్యంకొనుగోలులో పారదర్శకతతో వ్యవహరించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్, శిక్షణాసిబ్బంది, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బరుతో ఉపాధి కల్పన

అంతర్వేది, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బరుతో తీర ప్రాంత ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల మత్స్యకారులకు ఉపాధి కల్పన జరుగుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది పల్లిపాలెంలో ఉన్న మినీ ఫిషింగ్ హార్బరును బుధవారం ఆయన కూటమి శ్రేణులతో కలిసి పరిశీలించారు. హార్బరులో కనీసం విద్యుత్, మంచినీరు సదుపాయాలు లేక పోవడం, ఇతర ప్రాంతాల నుంచి 300నుంచి 400 బోట్లు ఇక్కడికి చేరుకుంటున్నాయని స్థానిక మత్స్యకారులు ఎమ్మెల్యేకు వివరించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), గుబ్బల ఫణికుమార్, తిరుమాని ఆచార్యులు, గుబ్బల రవికిరణ్, ఎంపీపీ వీరా మల్లిబాబు, పోతాబత్తుల రాంబాబు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక

అమలాపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 స్కేటింగ్ పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన కోటుం కుమార్‌చందుశ్రీధర్ అద్భుత ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శ్రీధర్‌ను కోనసీమ జేఏసీ చైర్మన్, తహశీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్‌బుధవారం సత్కరించారు. గెల్లా వెంకటేష్, కేఎన్ మూర్తి, బొంతు రమణ, పచ్చిమాల రమేష్‌బాబు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలతో మహిళలకు ఉపాధి

● మంత్రి వాసంశెట్టి సుభాష్



మహిళల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో భర్తను కోల్పోయిన 30 ఏళ్ల లోపు మహిళలకు చిన్నతరహా పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక లయన్స్ కల్యాణమండపంలో నియోజకవర్గంలో 134మంది భర్తను కోల్పోయి పిల్లలతో ఉన్న 30 ఏళ్లలోపు మహిళలు పరిశ్రమలశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో 5 ఎకరాల స్థలం సేకరించి ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుచేస్తామన్నారు. మహిళలను 10మందితో గ్రూపు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నతరహా పరిశ్రమలపై అవగాహన కల్పించేందుకు పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు బ్యాంకురుణాలు మంజూరు చేయిస్తామని లబ్ధిదారుల వాటా తన సొంత నిధులతో పాటు దాతల సహకారం తీసుకుంటామన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి ఉత్తీర్ణత సాధించి పరిశ్రమలు స్థాపిస్తే రూ.50లక్షలు రుణం మంజూరు చేస్తుందని, అందులో 18లక్షలు సబ్సిడీగా లభిస్తుందన్నారు. 8వ తరగతిలోపు చదువుకున్న వారికి రూ.10లక్షలు వరకు రుణం మంజూరు చేస్తుందన్నారు. వివిధ చిన్నతరహా పరిశ్రమలు గురించి వివరించారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, పోతాబత్తుల విజయ్‌కుమార్, చిర్రా రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'జాబ్‌కార్డు ఉన్న అందరికీ 100 రోజులు పనికల్పించాలి'

కపిలేశ్వరపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో భాగంగా 100 రోజులు పని కల్పించాలని కోరుమిల్లి, కాలేరు గ్రామాల సర్పంచ్‌లు ఆచంట సత్యనారాయణ, దాయం కావేరిలు అన్నారు. బుధవారం మండలంలోని కోరుమిల్లి, కాలేరు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలవద్ద నిర్వహించిన ఉపాధి గ్రామ సభల్లో వారు పాల్గొని మాట్లాడారు, ఏపీవో రవికిరణ్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల ప్రణాళికను గ్రామసభల్లో చదివి వినిపించారు. గ్రామపరిధిలో చేపట్టబోయే మొక్కల పెంపకం, చెరువులు, పంట బోదెలు, కాలువలు, మట్టిరోడ్లు, తదితర పనులకు సంబంధించి కోరుమిల్లిలో రూ.58లక్షల అంచనావ్యయంతో 40 పనులను, కాలేరులో రూ.45లక్షలతో అంచనా వ్యయంతో 48 పనులను గుర్తించినట్లు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు సుంకర సుబ్బారావు, కొత్తపల్లి క్రాంతికుమార్‌లు తెలిపారు. ఈ పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏపీవో రవికిరణ్ తెలిపారు. కార్యక్రమాల్లో వల్లూరి కాశీవిశ్వనాథం, పెయ్యల యాకోబు, గ్రామకార్యదర్శులు కామేశ్వరరావు, యు. సుప్రియ, జేఈ రంజిత్‌సింగ్, పీఏ లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు సుబ్బారావు, క్రాంతికుమార్, ఉపాధిమేట్లు, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లబాయ్‌పటేల్ జయంతి

కొత్తపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లబాయ్ జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన బుధవారం కళాశాల ప్రాగంణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ టీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిపాదిత పనుల రద్దుకు కౌన్సిల్ ఆమోదం

● తాగునీటి కనెక్షన్ల దరావతు పెంపునకు నిరాకరణ ● రామచంద్రపురం కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పురపాలక సంఘంలో రూ.3.50కోట్లతో గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన 59 అభివృద్ధి పనుల రద్దుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాలులో జరిగింది. పట్టణంలో 28 వార్డుల్లో గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదించిన రూ.3.50కోట్ల అభివృద్ధి పనులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో సదరు పనులు రద్దుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రక్షిత మంచినీటి సరఫరాకు రూ.75లక్షలు ఖర్చవుతుందని, ఆదాయం రూ.16.50లక్షలు వస్తోందని, తాగునీటి కనెక్షన్ల దరావత్తు పెంచేందుకు ప్రతిపాదనపై కౌన్సిలర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు ప్రజలకు ఉచితంగా అందించాలని, కుళాయి దరావత్తు పెంపుతో పేదలపై భారం పడుతుందని ప్రతిపాదన విరమించుకోవాలని సూచించారు. మరో కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్ కూడా దరావత్తు పెంపును వ్యతిరేకిస్తూ వాటర్‌బైలా రూపొందించడాన్ని ఆమోదించారు. వెల్ల రక్షిత మంచినీటి ప్రాజెక్టు వద్ద ఇద్దరు వర్కర్లు, పంపు ఆపరేటర్ నియామకానికి ప్రతిపాదనపై సీడీఎంఏ అనుమతికి పంపాలని కౌన్సిలర్ సాయిప్రసాద్ సూచించారు. 19, 20వ వార్డుల్లో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగింపునకు వచ్చిన అభ్యర్థనపై చర్చించారు. ఇలా ఫిర్యాదులపై ఆక్రమణలు తొలగింపు చేపట్టడం సరికాదని, మున్సిపాల్టీకి మాస్టర్‌ప్లాన్ ఉందని, మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని కౌన్సిలర్ సాయిప్రసాద్ అన్నారు. దీంతో ఈ అంశాన్ని తిరస్కరించారు. మున్సిపల్ భవనాలకు అద్దె బకాయిలు రూ.46లక్షలు చెల్లించాల్సి ఉందని, ఎందుకు చర్యలు చేపట్టలేదని సాయిప్రసాద్ ప్రశ్నించారు. బకాయిలు వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బంది, అప్పటి కమిషనర్లకు నోటీసులు ఇవ్వాలన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు షాపింగ్ కాంప్లెక్సులో 5షాపులు అద్దెలు చెల్లించడంలేదని, తిరిగి షాపులు సబ్‌లీజుకు ఇచ్చి బెల్టు షాపులు నడుపుతున్నారని కౌన్సిలర్ సాయిప్రసాద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సబ్‌లీజులు రద్దుచేయాలని కోరారు. నెలకు ఒకసారి కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించాల్సి ఉందని, వరుసగా మూడునెలలు సాధారణ సమావేశాలు నిర్వహించకపోతే కౌన్సిల్ రద్దు అవు తుందని, గతంలో ప్రతీ నెలా 26న సాధారణ సమావేశం నిర్వహించాలని తీర్మానించిన సంగతి కౌన్సిలర్ గుర్తు చేశారు. ప్రతీనెలా 26న సాధారణ సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. రూ.4కోట్ల రుడా నిధులతో షాపింగ్ కాంప్లెక్సు, శ్మశానాలు అభివృద్ధికి పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వం తిరస్కరించిందని, మళ్లీ ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. అవసరమైతే జనరల్ ఫండ్స్ నుంచి శ్మశానవాటికలు అభివృద్ధి చేయాలని కోఆప్షన్ సభ్యుడు మస్తాన్ కోరారు. వీధికుక్కలకు బర్త్ కంట్రోల్ వ్యాక్సినేషన్ చేయించేందుకు రూ.6 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాతబస్టాండులో రుడానిధులతో పాత షాపింగ్ స్థానంలో నూతన కాంప్లెక్సు నిర్మాణం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 14అంశాలకు 13అంశాలు ఆమోదించి, ఒకఅంశాన్ని తిరస్కరించారు. వైస్‌చైర్మన్ కొలమూరి శివాజీ, కమిషనర్ నాయుడు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్



సోమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి శ్రీ ఛాయాసోమే శ్వరస్వామిని కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో భీమశంకరం అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సుభాష్ సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బేడా మండపంలో ఈవో భీమశంకరం మంత్రి సుభాష్‌కు శాలువా కప్పి సత్కరించారు. వేదపండితులు వేదాశీర్వాదం అందజేశారు.

మంత్రిని కలిసిన సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్

కోనసీమజిల్లా సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్‌గా బాలసరస్వతి నియ మితులయ్యారు. ఔఆమె బుధవారం కోటిపల్లిలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు.

బల్లపై నిద్రిస్తూ వ్యక్తి మృతి

ద్రాక్షారామ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయం బయట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంవద్ద విశ్రాంతి బల్లపై బుధవారం ఉదయం కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన ముద్రగడ చంద్రశేఖర్ మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు గుర్తించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కొత్తపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడిగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పట్టభద్రులు ఓటు నమోదుకు ముందుకు రావాలని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి కోరారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోను ఓటు నమోదు ప్రక్రియ చేసుకోవచ్చునన్నారు. అనంతరం కొత్తపేటలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు.కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, తమ్మన సాయిప్రసాద్, శ్రీనివాసరావు, అన్నవరం, మునేశ్వరరావు, టి.సీతారామరాజు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో దీపావళి వేడుకలు

మండపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం ముందస్తుగా దీపావళి వేడుకలను ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో జరుపుకున్నారు. దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి పండుగని ఆయన వివరించారు. పాఠశాలకు చెందిన ప్రీప్రైమరీ, విద్యార్థులు దీపాలు వెలిగించి దివిటీలు కొట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేష్, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కార్తీకమాసోత్సవానికి ఏర్పాట్లు



ఈవో అల్లు వెంకటదుర్గా భవాని

ద్రాక్షారామ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం, ప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నవంబరు 2నుంచి డిసెంబరు 1వరకు జరిగే కార్తీకమాసం మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కార్తీకమాసంలో ఆలయం తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రిసమయం లో యాత్రాబస్సులు ద్వారా చేరుకునే భక్తులు దర్శనాలు చేసుకునేంతవరకు తెరచి ఉంచుతామన్నారు. భక్తులకు స్వామివారిని దర్శించేందుకు ఉచిత దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. ఎక్కువ సమయం క్యూలైన్లలో ఉండలేనివారికి శ్రీఘ్రదర్శనం రూ.50, విశిష్టదర్శనం రూ.100 టిక్కెట్ ద్వారా సౌకర్యం కల్పించామన్నారు. ఉచిత, శ్రీఘ్రదర్శనాలకు వేరుగా క్యూలైన్లు ఏర్పాటుచేశామని ఎండ, మంచు తగలకుండా షామియానాలు వేస్తున్నామన్నారు. కింద క్యాయర్‌మేట్లు వేస్తున్నామన్నారు. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభిషేకాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సప్తగోదావరినదిలో భక్తులు స్నానమాచరించేందుకు ఎప్పటికప్పుడు నీరుశుద్ధి చేస్తామని, వస్త్రాలు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రక్షణకు భారీకేడ్లు, గజఈతగాళ్ల ఏర్పాటు చేశామన్నారు. భక్తులు రాత్రి బసచేసేందుకు డార్మెటరీ గదులు రంగులువేసి సిద్ధం చేశామని తెలిపారు. భక్తులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వామివారి అన్నప్రసాదం అందజేస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేకదర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఐ పరిరక్షణ సమితి ఏర్పాటు

రాయవరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవస్థల్లో పేరుకుపోయిన అవినీతిని వెలికితీసేందుకు ఆర్టీఐ పరిరక్షణ సమితి స్థాపించనున్నట్లు మండలంలోని వెంటూరుకి చెందిన ఖండవిల్లి భరత్‌కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. అధికారులు ప్రజలకు సేవకులమనే భావన ఏర్పడినప్పుడే సామాన్యుడికి న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలో 23 జిల్లాలు పర్యటించి నూతనకమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు భరత్‌కుమార్ చెప్పారు.

కాలువలో జారిపడిన వ్యక్తి మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన ఖండవల్లి కాశీవిశ్వనాథం(67) ఈనెల 28న స్థానిక ప్రధాన పంట కాలువలోకి స్నానానికి దిగగా ప్రమాదవశాత్తూ కాలుజారి గల్లంతయ్యాడు. బుధవారం గ్రామంలోని లాకులవద్ద అతని మృతదేహం లభ్యమైంది. మృతుని భార్య సూర్యనాగమణి ఫిర్యాదు మేరకు అంగర ఎస్ఐ డి.రవికుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుడు విశ్వనాధంకు భార్య, కుమార్తె ఉన్నారు.

భూసర్వే కంటే ముందు ఉన్న రికార్డులు అమలుచేయాలి

కె.గంగవరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భూసర్వే రద్దుచేసింది. భూసర్వేలోని అంశాలపై తప్పు ఒప్పులు సరిచేసుకోమనడం ఏమిటి. పాత రికార్డులనే కొనసాగించాలని పాణింగపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సుకు హాజరైన ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు భూసర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కారం కోసం సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సర్వేయర్ పావని మాట్లాడుతూ భూసర్వేలో సమస్యలు రావడానికి కారణాలు వివరించారు. ఇప్పుడు ప్రభుత్వం వాటిని సరిచేయడానికి దరఖాస్తులు తీసుకుంటుందని వివరించారు. ఈ సమయంలో కొందరు రైతులు కూటమి ప్రభుత్వం భూసర్వే రద్దుచేసింది. అటువంటప్పుడు ఇందులో తప్పులతో మాకు పనేంటి, పాత రికార్డులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దశలో సభలో గందరగోళం నెలకొంది. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మురళీ, ఆర్.ఐ. వెంకట్రావు రైతులకు వివరణ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చీకట్ల సునీత గోపాలం, కూటమి నాయకులు బలుసు నాగేంద్ర, కొత్తపల్లి మొరార్జీ పాల్గొన్నారు.

ఆలమూరు: రెవెన్యూ సదస్సుల పరిష్కారానికి వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని ఆలమూరు తహశీల్దార్ కె.జె.ప్రకాష్ బాబు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూముల రికార్డులు, సర్వే తదితర సమస్యలతో రైతు లు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఈసందర్భంగా రైతుల వద్ద నుంచి రెవెన్యూ ఫిర్యాదులను స్వీకరించారు. ఈసదస్సులో సర్పంచ్ నేలపూడి లావణ్యకుమార్ రాజా, డివిజన్ రెవెన్యూ సర్వేయర్ ప్రభాకరరావు, మండల సర్వేయర్ ప్రభావతి, పలువురు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.చిన్నారావు అన్నారు. బుధవారం మండలంలోని అంగర పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ భూసమస్యలపై రైతుల నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకులు పుత్సల శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి ఈశ్వరరావు, వీఆర్‌వోలు పి. సత్యనారాయణమూర్తి, గుమ్మడి సీతామహాలక్ష్మి, సర్వేయర్లు, రైతులు, గ్రామస్థులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.